

మారుమూలకు వెళ్లం..! 10లో
టీచర్లకు మేలు చేయాలనే తలంపుతో ఉద్యోగోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా కొంతమంది తీరు విస్మయానికి గురిచేస్తోంది.



ఆపదలో అండగా..
ఆపద, ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి మన్యప్రగతి చారిట్రబుల్ ట్రస్ట్ తల్లీ బిడ్డ సురక్ష సేవ అండగా నిలుస్తోంది. 10లో



రెండోరోజు ఆక్రమణల తొలగింపు
పాడేరులో ఆర్అండ్బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు రెండోరోజూ కొనసాగాయి. 10లో

ప్రయాణం సాహసమే!

- అభివృద్ధికి నోచుకోని మారేడుమిల్లి - చింతూరు ఘాట్‌రోడ్డు
- భారీ వాహనాలు మొరాయిస్తే బస చేయాల్సిందే
- మెకానిక్ వచ్చే వరకు కష్టమే
- అడగడుగునా ప్రమాదకర మలుపులు
- మూడు రాష్ట్రాలకు కీలక రహదారి

మారేడుమిల్లి- చింతూరు ఘాట్‌రోడ్డు.. చెప్పాలంటే జిల్లాలోనే అతి పెద్దది.. మూడు రాష్ట్రాలకు కీలకమైన ఈ మార్గంలో భారీ వాహనాల ప్రయాణం సాహసమే. ప్రమాదకరమైన మలుపుల వద్ద ఏమాత్రం అజాగ్రత్త వహించినా లోయల్లో పడిపోవాల్సిన పరిస్థితి. ప్రమాదానికి గురైనప్పుడు కనీసం వాహనాన్ని పైకి తీసే పరిస్థితి కూడా ఉండదు.

రంపచోడవరం: మారేడుమిల్లి-చింతూరు మధ్య దూరం సుమారు 75 కిలోమీటర్లు. ఇందులో 28 కిలోమీటర్లు కీలకం. ప్రమాదం సంభవించిన సందర్భంలో సింగిల్‌రోడ్డు కావడంతో వాహనాలు గంటల తరబడి నిలిచిపోతుంటాయి. ఈ మార్గంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం అనుభవం ఉన్న డ్రైవర్లుకే సాధ్యమవుతుంది. అనుభవం లేని డ్రైవర్లు అయితే గమ్యం చేరడం కష్టమే. అతి పెద్ద ఘాట్ కావడం వల్ల మార్గం మధ్యలో వాహనాలు మొరాయిస్తుండటంతో కాసేపు నిలిపివేయాల్సిన సందర్భాలు ఉంటాయి.

కచ్చా మార్గం పక్కా రోడ్డుగా..

ఒకప్పుడు ఈ మార్గం కచ్చారోడ్డుగా ఉండేది. రాజమహేంద్రవరం పేపర్ మిల్లుకు వెదురు లోడును తీసుకువెళ్లేందుకు ఈ మార్గంలోనే వాహనాలు రాకపోకలు సాగించేవి. కాలక్రమేణా ఈ మార్గం కీలకంగా మారడంతో సింగిల్ రోడ్డు. ఆతరువాత డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేశారు. అప్పటినుంచి భద్రాచలం వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి.

ఒకప్పుడు లాంచీ ప్రయాణం..

మారేడుమిల్లి- భద్రాచలం రోడ్డు లేని సమయంలో భద్రాచలం వెళ్లేందుకు లాంచీలను ఆశ్రయించేవారు. రాజమండ్రిలో మెయిల్ లాంచీ ఎక్కి కూనవరం వరకు వెళ్లి అక్కడ నుంచి భద్రాచలం చేరుకునే వారు. రోడ్డు మార్గం ఏర్పడటంతో తరువాత కాలంలో లాంచీ ప్రయాణం తగ్గిపోయింది. కాలక్రమేణా భద్రాచలం లాంచి సర్వీసులనే నిలిపివేశారు.



ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన లారీలు

ఒకరికొకరు సాయంతో..

లోడ్ వాహనాలు సాధారణంగా ఐదు నుంచి ఆరు వరుసగా వెళ్తాయి. దీనివల్ల ఘాట్ రోడ్డులో ఎవరికి ఏ ఇబ్బంది ఎదురైనా ఒకరికొకరు సాయం చేసుకుంటారు. వారి పరిధి దాటితే మెకానిక్ వచ్చే వరకు క్లీనర్, డ్రైవర్ అక్కడే ఉండిపోతారు. రాత్రి వేళల్లో ఘాట్ దాటేందుకు ఏమాత్రం ప్రయత్నించరు.

ఎనిమిది వరకు కీలక మలుపులు..

రంపచోడవరం నుంచి చింతూరు వరకు 75 కిలోమీటర్ల పొడవునా గల రహదారిలో కీలకమైన ఘాట్ రోడ్డు సుమారు 28 కిలోమీటర్లు ఉంది. మారేడుమిల్లి దాటిన తరువాత పాములేరు వాగు నుంచి ఘాట్ ప్రారంభమై సోకులూరు వాగు వద్ద ముగుస్తుంది. కీలకమైన మలుపులు సుమారు ఎనిమిది వరకు ఉన్నాయి.

భారీ వాహనాలు ఎదురైతే..

ఘాట్ మార్గంలో ఎదురుగా భారీ వాహనాలు వస్తున్నప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. డబుల్ రోడ్డు అయినా మలుపులు ఉన్నందున తప్పించుకుని వెళ్లడం కష్టసాధ్యంగా మారింది. ప్రమాదకర మలుపుల వద్ద ఎదురుపడినప్పుడు తప్పించుకుని పక్క నుంచి వెళ్లేందుకు గంటల తరబడి సమయం పడుతోంది. ఇదే సమయంలో భారీ వాహనాలు మొరాయించి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి.

వంటా వార్పు అక్కడే

ఘాట్‌రోడ్డులో వాహనం మొరాయించిందంటే డ్రైవర్, క్లీనర్ అవస్థలు గురి కావాల్సిందే. మెకానిక్ రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు నుంచి మెకానిక్‌లు రావడానికి ఎక్కువ సమయం పడుతుంది. మరమ్మతులు చేపట్టి రోడ్డెక్కేందుకు కనీసం 24 గంటల పడుతుంది. ఆసమయంలో తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకవు. అందువల్ల లారీలో అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసుకుంటారు. వాహనం ఆగిపోయిన సందర్భంలో అక్కడే బస చేసి వంట చేసుకుంటారు. రాత్రి వరకు వాహనం ఘాట్ రోడ్డులో ఉంచేందుకు వారు సాహసించరు.

సాధ్యం కాని ఘాట్ విస్తరణ

ఈ ఘాట్ మార్గాన్ని అభివృద్ధి చేయాలంటే రోడ్డుకు లోపలి వైపున కొండను తొలిచి విస్తరించాలి. ఇందుకు కేంద్ర పర్యావరణశాఖ అనుమతులు తప్పనిసరి. ఇది ఇప్పటిల్లో సాధ్యమయ్యే పరిస్థితి లేదు. అందువల్ల ఈ దిశగా ప్రభుత్వాలు కూడా ఆలోచించడం లేదు.



ఘాట్‌రోడ్డు మలుపు వద్ద అతికష్టంగా వెళ్తున్న భారీ లోడు వాహనం



ఘాట్‌రోడ్డులో తిరగబడిన లారీ

అంతర్రాష్ట్ర వాహనాలకు కీలకం..

మారేడుమిల్లి- చింతూరు ఘాట్ రోడ్డులో ప్రతిరోజూ ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి వాహనాలతో పాటు భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి తవుడు, బియ్యం, గ్రానెట్, రాజమండ్రి పేపరు మిల్లుకు వెదురు, టేకు కలప, భీమవరం నుంచి చేపలు, బెల్లం, కోళ్లు, కొబ్బరి కాయలు ఈ మార్గంలో ఎక్కువగా రవాణా అవుతుంటాయి.

నిర్వహణ భారంతో..

పాపికొండలు జాతీయ వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం పరిధిలో 28 కిలోమీటర్ల ఘాట్ రోడ్డు ఉన్నందున జంతువులు రోడ్డుపైకి వచ్చేస్తుంటాయి.దట్టమైన అటవీప్రాంతం ఉన్నందున అటవీశాఖ టైగర్‌జోన్ ఏర్పాటుచేసింది. రానురాను వనాలు తగ్గిపోవడంతో ఈ ప్రాంతంలో పులుల సంచారం తగ్గిపోయింది. ఇక్కడ ఏర్పాటుచేసిన బేస్‌క్యాంపు నిర్వహణ కూడా అటవీశాఖకు భారం కావడంతో నామమాత్రంగా మారింది.

దట్టమైన అడవి వల్ల భయపడ్డా

ఛత్తీస్‌గఢ్ నుంచి లోడ్‌తో వస్తున్నాం. ఘాట్ మార్గంలో లారీ మొరాయించి మధ్యలో ఆగిపోయింది. డ్రైవర్ మెకానిక్‌ను తీసుకురావడానికి వెళ్లాడు. రాత్రి నుంచి ఇక్కడే ఉన్నా. వాహనంలో మంచి నీరు, వంట సామగ్రి ఉంది. ఎటువంటి ఇబ్బంది ఉండదు. అయితే దట్టమైన అటవీప్రాంతం కావడంతో వన్యప్రాణుల వల్ల ఏదైనా ప్రమాదం ఉండవచ్చని భయపడ్డా.

–సూరజ్, ఛత్తీస్‌గఢ్

సకాలంలో విత్తనాల పంపిణీ

- సిబ్బంది సిద్ధం కావాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

పాడేరు: రైతులకు సకాలంలో వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల ద్వారా వచ్చే నెల ఒకటో తేదీన రూ.75లక్షల విలువైన వ్యవసాయ యంత్రపరికరాలు పంపిణీకి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈనెల 30న అందిస్తున్న రైతు భరోసా కార్యక్రమంలో లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5వేలు, కేంద్ర ప్రభుత్వం తరపున రూ.2500 అందిస్తున్నట్లు చెప్పారు. 15 వేల హెక్టార్లలో కాఫీపంట విస్తరణ, 11వేల హెక్టార్లలో ఏకీకరణ, ఎంఐడీఎస్ పథకం కింద 1250 హెక్టార్లు, 350 హెక్టార్లలో పునరుత్పాదన, బిందుతుంపర్ల సేద్యం కింద 500 హెక్టార్లు, ఆయిల్‌ఫాం కింద 250 హెక్టార్లలో అభివృద్ధి చేయాలని సూచించారు. విత్తనాలు మొలకశాతం పరిశీలించి తీసుకోవాలని, కమిటీ సభ్యులైన జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు, డ్వామా పీడీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద పనుల్లేని గ్రామాలు ఉండకూడదని, జిల్లాలో 567 గ్రామాల్లో పనులకు సంబంధించి సెల్ఫ్ ఏర్పాటు చేసి పనులు మంజూరు చేయించాలని సూచించారు. మరో 30 లక్షల పనిదినాలు కల్పించాలని, సగటున వేతనం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.



రైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రైతులకు అందుబాటులో ఉండాలి

గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు అండగా నిలవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించినప్పటికీ, కార్యాలయంలో రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనేక సమస్యలపై సందేహాలు నివృత్తి కోసం వచ్చే రైతులకు అవగాహన కల్పిస్తూ వారితో మాట్లాడాలని సూచించారు. గ్రామ సహాయకులు హాజరు వేసిన తరువాత ఫొటోలు జిల్లా వ్యవసాయాధికారికి పంపాలన్నారు. ఈ వివరాలను ప్రతిరోజు వాటిని పీడీఎఫ్ రూపంలో తనకు పంపాలని జిల్లా వ్యవసాయశాఖాధికారిని ఆదేశించారు. గ్రామసహాయకుల సేవలు అందించడంలో విఫలమైతే చర్యలు తప్పవన్నారు. సర్వీస్ నుంచి తొలగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మండలాలవారీగా రైతులకు బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించడంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాఫీమొక్కలను నిజమైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 4500 ఎకరాల్లో గంజాయి పంట నుంచి విముక్తి పొందిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలవైపు ప్రోత్సహించాలని కోరారు. డ్వామా ఏపీడీలు తన కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పీడీని కోరారు. ప్రస్తుతం నాలుగు రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, మరో ఏడు రకాలు రానున్నాయని తెలిపారు.రాగి, కొర్రలు, అండుకొర్రలు, సామలు, వేరుశనగ విత్తనాలు పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి మాట్లాడుతూ గతంలో ఐటీడీఏ ద్వారా పవర్ వీడర్స్‌కు డబ్బులు చెల్లించినప్పటికీ యంత్రాలు కొంతమందికి అందలేదన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌ను ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు పలువురు రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు బీఎస్ఎన్.నందు, పి.రమేష్, డ్వామా పీడీ రమేష్‌రామన్, మార్కెటింగ్ ఏడీ రాకేష్ పాల్గొన్నారు.

బాధ్యతగా స్పందన అర్జీల పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: స్పందనలో స్వీకరించిన అర్జీదారుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపైనే ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. స్పందనపై ప్రజలకు నమ్మకంతో అర్జీలు అందజేస్తున్నారని, అన్నిశాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీలను సంబంధిత శాఖలకు పంపిస్తున్నామని, వీటి పరిష్కారానికి సంబంధించి 24 గంటల్లో విచారణాధికారిని నియమించాలని పేర్కొన్నారు. నెలలో 22 రోజుల పాటు అధికారులు, ఉద్యోగులు ముఖ హాజరు వేస్తేనే జీతాలు చెల్లించాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఎఫ్ఆర్ఎస్ లేకుండా జీతాలు చెల్లిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, డీఆర్వో పి.అంబేద్కర్, పంచాయతీరాజ్, ఈఈ టి, కొండయ్య పడాల్, ఆర్అండ్‌బీ ఈఈ, బాలసుందరబాబు, జిల్లా వ్యవసాయాధికారి, ఎస్‌బీఎస్.నంద్, డీపీవో కొండలరావు, డీఎల్పీవో పీఎస్ కుమార్ పాల్గొన్నారు.

స్పందనకు 85 అర్జీలు

ఐటీడీఏలో శుక్రవారం నిర్వహించిన స్పందనకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 85 అర్జీలు స్వీకరించారు.

- కాలనీ ఇల్లు పునాది బిల్లు మంజూరు చేయాలని ముంచంగిపుట్టు మండలం, బంగారుమెట్ట పంచాయతీ శరభపుట్టుకు చెందిన జాగరపు భీమరాజు వినతిపత్రం అందజేశాడు.
- గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి మంజూరు చేయాలని జీకే వీధి మండలం జెర్రెల పంచాయతీ, జెర్రెల కొత్తూరుకు చెందిన జర్తా రాజారావు అర్జీ అందజేశారు.
- అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని పెదబయలు మండలం, పెదకోడాపల్లి పంచాయతీ మెరకచింతకు చెందిన జి.రమణమ్మ, ఎం.రాంబాబు అధికారులను కోరారు.
- జీసీసీ హమాలీలకు పదమూడు నెలల లోడింగ్, అన్ లోడింగ్ చార్జీలు చెల్లించాలని, గిరిజన ప్రాంత హమాలీల సంఘ నాయకుడు వి.పండుబాబు, పలువురు హమాలీలు అర్జీ సమర్పించారు.
- పెదబయలు మండలం, గోమంగి పంచాయతీ, వంకరాయి సంపంగిబంద, పంగళం గ్రామాలకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు పూర్తి చేశాక, అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకుని రోడ్లను అభివృద్ధి చేయాలని ఆయా ప్రాంతాలకు చెందిన జి.మాణిక్యం, కె.జ్యోతి, జి.రూపాలమ్మ తదితర 41 మంది వినతిపత్రం సమర్పించారు.



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అందుబాటులో రిజిస్ట్రేషన్ సేవలు

- గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు



సాక్షి,పాడేరు: గిరిజనులకు రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ సేవలు అందుబాటులోకి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు జీవోలు జారీ చేసిందని జిల్లా రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని, రిజిస్ట్రేషన్ చట్టం 1908కు లోబడి పాడేరు, రంపచోడవరం, చింతూరు, డివిజన్ల పరిధిలోని గిరిజనులకు భూముల రిజిస్ట్రేషన్, క్రయ, విక్రయాలు, ఫర్మ్ రిజిస్ట్రేషన్, వివాహ రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లో ఉన్న వెసులుబాటుకు అనుకూలంగా పాడేరులో ఏర్పాటు చేసిన ఐటినరేటింగ్ సెంటర్‌ను అనకాపల్లి జిల్లా వి.మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, రంపచోడవరంలోని ఐటినరేటింగ్ సెంటర్‌ను కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుసంధానం చేసినట్టు తెలిపారు. ఇప్పటికే రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతానికి కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందిస్తున్న సేవలు ఏపీ షెడ్యూలు ఏరియా భూ బదలాయింపు నియంత్రణ చట్టం- 1959, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ఏరియా భూ బదలాయింపు నిబంధనలు 1969కు లోబడి ఉంటాయన్నారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో జారీ చేయబడిన ఫారం కె, ఎల్‌కు లోబడి రిజిస్ట్రేషన్ సేవలు అందించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.156, 158ల అమలుపై కలెక్టర్, పాడేరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవోలతో చర్చించినట్టు ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీని భూ బదలాయింపు చట్టాలకు లోబడి సేవలు అందించాలని ఆదేశించారని ఆయన వెల్లడించారు. గిరిజనులకు పారదర్శకంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆస్తుల వివరాలు, సర్టిఫైడ్ కాపీలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 30న మెజిస్టీరియల్ విచారణ

మహారాణిపేట: విశాఖ సెంట్రల్ జైలులో పాడేరుకు చెందిన రిమాండ్ ఖైదీ కొర్ర వెంకటరమణ మృతిపై ఈనెల 30న మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు విశాఖ ఆర్డీవో హుస్సేన్ తెలిపారు. గత ఏప్రిల్ 16న అనారోగ్యానికి గురైన వెంకటరమణను కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడని ఆయన పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు మెజిస్టీరియల్ విచారణ నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. వెంకటరమణకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిసి ఉంటే మెజిస్టీరియల్ విచారణలో తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం

విశాఖ లీగల్: విశాఖలో శనివారం జరగనున్న మూడు జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశానికి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శనరెడ్డి హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన కడప నుంచి నగరానికి చేరుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్టులో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీశ్వర్‌రావు, 11వ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, పోక్సో కోర్టు పీపీ కరణం కృష్ణ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యుడు ఎస్.కృష్ణమోహన్ ఘనంగా స్వాగతం పలికారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌తో పాటు, హైకోర్టు పీపీ వై.నాగిరెడ్డి, అదనపు పీపీ ఎస్.దుష్యంత్‌రెడ్డి కూడా నగరానికి చేరుకున్నారు. వీరు ఉమ్మడి విశాఖ జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తీరు, వివిధ కేసుల విచారణ, పెండింగ్ కేసులు, పీపీల సమస్యలపై చర్చిస్తారు. తొలిసారిగా న్యాయవాద వృత్తి నుంచి డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా నియమితులైన సుదర్శనరెడ్డికి పలువురు సీనియర్ న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు.

బ్యాంక్ లింకేజీని సద్వినియోగం చేసుకోండి

సాక్షి,పాడేరు: ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలు బ్యాంకు లింకేజీని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారిత సాధించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పాడేరు మండలానికి చెందిన 54 స్వయం సహాయక సంఘాలకు యూనియన్ బ్యాంక్ అందించిన బ్యాంకు లింకేజి మొత్తాన్ని ఆయా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు లింకేజీతో మంచి వ్యాపారాలు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంకు లింకేజి రుణాలను వ్యాపారాలకు వినియోగించుకుని సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి. మురళి, లీడ్ బ్యాంకు మేనేజర్ రవి కిరణ్, ఏపీఎంలు, మహిల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



డ్వాక్రా సంఘాలకు నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

క్రికెట్ టోర్నీ విజేత 'రంపచోడవరం'

- విజేతలకు నగదు బహుమతుల పంపిణీ
- ముఖ్య అతిథిగా హాజరైన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

గంగవరం: దివంగత కలుముల కామరాజు దొర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో రంపచోడవరం జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే విచ్చేశారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు బహుమతి, మెమెంటోలను అందజేశారు. యువసేన, ఓల్డ్ టైగర్స్ ఆధ్వర్యంలో 22 రోజులపాటు ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ద్వితీయస్థానంలో పాముగంటి జట్టు, తృతీయ స్థానంలో సూరంపాలెం, నాలుగో స్థానంలో ఓజోబంద జట్టు నిలిచింది. మొదటి బహుమతికి రూ.30 వేలు, ద్వితీయ బహుమతికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.6వేల నగదు బహుమతిగా అందజేశారు. ఎస్ఐ చిన్నబాబు, బెత్తర సంతోష్, సీఆర్పీఎఫ్ జవాన్ పరదా అప్పన్నదొర, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, చీటిపాలెం వెంకన్నదొర నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ జెడ్పీ హైస్కూల్ మైదానంలో క్రీడాకారులకు అనువుగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. యువసేన తరఫున పీవోను సర్పంచ్ సత్కరించారు. ఆశ్రమ పాఠశాల పీడీ సుజిన్‌దొర పెన్సిల్‌తో చిత్రీకరించిన పీవో సూరజ్ గనోరే చిత్రాన్ని ఆయనకు అందజేశారు. గంగవరానికి చెందిన ఉపాధ్యాయుడు కె.రాంబాబు ఏర్పాటుచేసిన ఐక్య కోయ చారిటబుల్ ట్రస్టు లోగోను పీవో ఆవిష్కరించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, జెడ్పీటీసీ బేబీ రత్నం, ఎంపీపీ తల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ గంగాదేవి, పాముగంటి సర్పంచ్ కోసు బుచ్చన్న దొర పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న పీవో సూరజ్ గనోరే



ఐటీడీఏ పీవోను సత్కరిస్తున్న సర్పంచ్

న్యూస్‌రీల్

మెరుగైన సేవలందించాలి



జీకేవీధిలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

గూడెంకొత్తవీధి: సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో పర్యటించారు. ముందుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గూడెంకొత్తవీధి, గాలికొండ సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం సీలేరు పర్యటనకు వెళ్లారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.శుక్రవారం ఆస్పత్రిలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ పాలక మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు వివరాలను సూపరింటిండెంట్ ఆదిత్యకీర్తినుంచి తెలుసుకున్నారు.వంద పడకల ఆస్పత్రి నిర్మాణ దశలో ఉన్నందున ప్రస్తుతం అవకాశం ఉన్నంత వరకు బెడ్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రిలో అవసరమైన సౌకర్యాలపై తనకు నివేదిస్తే త్వరలో పాడేరులో పర్యటించనున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు



నిందితుడితో సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు అరకులోయ సీఐ రుద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలాఉన్నాయి. చిత్రకొండకు చెందిన సుకురి రమేష్ శుక్రవారం ఒడిశా నుంచి అరకులోయ మీదుగా విశాఖపట్నం వైపు 150 కిలోల గంజాయితో కారులో బయలుదేరాడు. ఈ మేరకు ముందస్తు సమాచారం అందడంతో సుంకరమెట్ట చెక్‌పోస్టు వద్ద మాటు వేసి పట్టుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఐరిస్ కెమెరాల పంపిణీ



ఐరిస్ కెమెరాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

సాక్షి,పాడేరు: జిల్లాలోని రేషన్ పంపిణీ సంచార వాహనాల ఆపరేటర్లకు ఐరిస్ కెమెరాలను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు శుక్రవారం పంపిణీ చేశారు. బయోమెట్రిక్ పడని లబ్ధిదారులకు ఐరిస్ నమోదు చేసి నిత్యావసర వస్తువులను ఇంటింటికి పంపిణీ చేయాలని సూచించారు. జిల్లాలో 221 ఎండీయూలకు ఐరిస్ కెమెరాలు పంపిణీ చేస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

పెదబయలు: మండలంలోని గుల్లేలులో మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ సతీమణి తలుపులమ్మ(60) పాము కాటుతో మృతి చెందింది. గురువారం ఇంట్లో మంచంపై పడుకున్న ఆమె అర్ధరాత్రి సమయంలో పాముకాటుకు గురైంది. వెంటనే ఆమెను హుటాహుటిన 108 వాహనంలో గోమంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జెడ్పీటీసి కూడ బొంజుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, మాజీ ఎంపీపీలు కొరవంగి లీలావతి, సల్లంగి ఉమామహేశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


సత్తిబాబు

సీలేరు: విద్యుత్ ఉద్యోగుల సహకార సొసైటీ డైరెక్టర్‌గా సత్తిబాబు ఎన్నికై య్యారు. శుక్ర వారం గాజువాకలోని జరిగిన విద్యుత్ ఉద్యోగులు సహకార సొసైటీ ఎన్నికల్లో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ నుంచి డైరెక్టర్‌గా పోటీచేసిన సత్తిబాబుకు 374 ఓట్లు రావడంతో గెలిపొందారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులు ఆయనను అభినందించారు. నూతనంగా ఎన్నికైనా డైరెక్టర్ సత్తిబాబు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

రెండోరోజు ఆక్రమణల తొలగింపు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు రెండోరోజు కొనసాగాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం ఆక్రమణ తొలగింపు చేపట్టింది. శుక్ర వారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అంబేడ్కర్ కూడలి నుంచి సినిమాహల్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఎటువంటి గొడవలు జరగకుండా పోలీసుశాఖ సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణ్ ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలోని వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా తొలగింపునకు అవకాశం : కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లా కేంద్రంలోని రోడ్డును ఆక్రమణలను వ్యాపారులు మూడు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. రోడ్డుకు ఆనుకుని ఆక్రమణలను రెండు రోజులుగా తొలగిస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో వ్యాపారులు కలెక్టర్‌ను శుక్రవారం కలిసి విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇప్పటికే 60 శాతం ఆక్రమణలు తొలగించారని, మిగతా 40శాతం వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ పాల్గొన్నారు.

తీరిన వెతలు

- బస్సు వచ్చే..ప్రయాణ కష్టాలు తీరే
- పెదగూడకు ఎట్టకేలకు ఆర్టీసీ సర్వీసు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: పక్కా రహదారి ఉన్నా.. ఆ ప్రాంత గిరిజనులకు రవాణా కష్టాలు నిత్యం వేధిస్తూ ఉండేవి.అధిక ప్రయాణికులతో ప్రైవేట్ వాహనలే దిక్కుగా ప్రయాణాలు చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు ఆ ప్రాంత గిరిజనుల కష్టాలు తీరాయి. ముంచంగిపుట్టు మండలం పెదగూడ పంచాయతీ కేంద్రానికి పక్క రహదారి సౌకర్యం కలిగి నాలుగేళ్ల అవుతుంది. పెదగూడ పంచాయితీలోని గ్రామాలతో పాటు దారెల, సుజనకోట పంచాయతీల్లో కలుపుకొని 28 గ్రామాలు పెదగూడ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్ల ప్రయాణం చేయాలి.గత 10 సంవత్సరాల కిందట ఆర్టీసీ బస్సును అధికారులు వేసి రహదారి బాగోలేదని కారణంతో అప్పటిలో బస్సు సర్వీసును నిలుపుదల చేశారు.అప్పటి నుంచి ఆ ప్రాంత గిరిజనులు ప్రైవేట్ వాహనలే దిక్కుగా రాకపోకలు చేస్తూ వచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చి వెంటనే పెదగూడకు అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మిలు ప్రత్యేక చొరవతో అసంపూర్తిగా వదిలేసిన తారురోడ్డును పూర్తి చేసి పక్క రహదారిని కల్పించారు. దీంతో రహదారి సమస్య తీరింది.కానీ రహదారి పూర్తయి నాలుగేళ్ల అవుతున్న ఆర్టీసీ బస్సు సర్వీసు మాత్రం లేదు. దీంతో పెదగూడ పంచాయతీ గిరిజనులు అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగ్యలక్ష్మిలను, పాడేరు ఆర్టీసీ అధికారులను కలిసి బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యేలు ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును ప్రారంభించారు. దీంతో 28 గ్రామాల గిరిజనులకు ప్రయాణ కష్టాలు తీరాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ముంచంగిపుట్టు నుంచి కొత్తూరు మీదగా పెదగూడకు బస్సు సర్వీసును నడుపుతున్నారు. ప్రయాణ కష్టాలు తీరడం, వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువచ్చేందుకు సులువుకావడంతో పెదగూడ పంచాయతీ గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


పెదగూడ నుంచి ముంచంగిపుట్టుకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

ఆనందంగా ఉంది

పక్క రహదారి నిర్మించి నాలుగేళ్ల అవుతుంది. కానీ ఆర్టీసీ బస్సు లేక పంచాయితీ ప్రజలు నిత్యం అవస్థలు పడుతూ ప్రైవేట్ వాహనాలపై రాకపోకలు చేసేవారు. బస్సు సౌకర్యం కల్పించాలని అరకు, పాడేరు ఎమ్మెల్యేలు పాల్గుణ, భాగలక్ష్మిలు పంచాయితీ ప్రజలతో వెళ్లి కలిసి సమస్యను విన్నవించారు. వారు స్పందించి సమస్య పరిష్కరించారు. బస్సు సౌకర్యం కలగడం ఆనందంగా ఉంది.

– ఎం.బాబురావు, సర్పంచ్, పెదగూడ, ముంచంగిపుట్టు మండలం

ఆపదలో అండగా

తీవ్ర రక్తస్రావంతో బాధపడుతున్న గర్భిణిను ఆస్పత్రికి తరలించిన ట్రస్ట్

హుకుంపేట: ఆపదలో ఉన్న గిరిజనులకు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి మన్యప్రగతి చారిట్రబుల్ ట్రస్ట్, తల్లీ బిడ్డా సురక్ష సేవ అండగా నిలుస్తోంది. శుక్రవారం మండలంలోని తీగలవలస పంచాయతీ వై.గరుడాపల్లి గ్రామానికి చెందిన పాంగి రాంబాబు భార్య రాములమ్మ మూడు నెలల గర్భిణి, తీవ్ర రక్తస్రావం కావడంతో బాధపడుతుండగా, భర్త రాంబాబు 108కు సమాచారం అందించారు. ఆ సమయంలో 108 రావడానికి అలస్యం అవుతందని తెలియడంతో స్థానిక యువకులకు తెలియపరిచారు. స్థానిక యువకులు మన్య ప్రగతి చారిట్రబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు సమచారం అందించారు. ఈ నేపథ్యంలో ట్రస్ట్ ప్రతినిధులు తక్షణమే స్పందించి, సంస్థ తరపున ఆటో ఏర్పాటు చేసి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉన్నట్టు భర్త రాంబాబు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆపదలో ఉన్నప్పుడు వెంటనే స్పందించి వాహనం ఏర్పాటు చేయడంపై ట్రస్టు సేవలకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

బదిలీలకు దరఖాస్తుల వెల్లువ

- ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికనే బదిలీలు
- 6 వేలకు పైగా దరఖాస్తులు, శరవేగంగా పరిశీలన


డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

విశాఖ విద్య: విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే శుక్రవారం సాయంత్రానికే 6 వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు డీఈవో కార్యాలయ అధికారులు వెల్లడించారు. జీరో సర్వీసుతో బదిలీకి అవకాశం కల్పించటంతో అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువగా దరఖాస్తులు వస్తాన్నాయి. ఇదిలా ఉంటే బదిలీ కోసమని వచ్చిన దరఖాస్తుల వాస్తవికతను నిర్ధారించేందుకు పరిశీలన ప్రక్రియ కూడా శరవేగంగా సాగుతోంది. 27 నాటికి దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిని వేగవంతం చేశారు. ఎస్జీటీలకు ఎంఈవో స్థాయిలో, స్కూల్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ డీఈవో, హెచ్ఎంలకు ఆర్జేడీ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటిని ధ్రువీకరిస్తున్నారు. ఒకే చోట 8 ఏళ్లకు పైబడిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఐదేళ్లకు పైబడిన హెచ్ఎంలు తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. దీంతో ఖాళీల జాబితాలను ప్రదర్శించేందుకు డీఈవో జీ. లక్ష్మణరావు నేతృత్వంలో కార్యాలయ సిబ్బంది తీవ్రమైన కసరత్తు చేస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్

ఉపాధ్యాయులు బదిలీల్లో ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సకాలంలో పరిష్కరించేలా డీఈవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్ ఫర్ జీవో గైడ్ లెన్స్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం జెడ్పీ హెచ్ఎస్ అనంతవరం, అగనంపూడి హెచ్ఎంలు కృష్ణకుమార్, కృష్ణారావును నియమించారు. ఆన్‌లైన్ దరఖాస్తులో తలెత్తే సాంకేతిక సమస్యల పరిష్కారంకు డీఈవో కార్యాలయ ఏఎస్‌వో జీ. సుబ్రహ్మణ్యం, అరకు ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న జీ. సత్యనారాయణకు బాధ్యతలు అప్పగించారు. బదిలీలకు సంబంధించిన ఫిర్యాదులపై డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కే. పల్లవికు బాధ్యతలు అప్పగించారు. బదిలీల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు వరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వీరు పనిచేస్తారు.

విదేశాల్లోనూ చదువులు ఫ్రీ



- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- టాప్ 50 యూనివర్సిటీల్లో చదువుకునే అవకాశం
- రూ.1.25 కోట్ల వరకు ఫీజు చెల్లింపు
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం

విశాఖ విద్య: పేద విద్యార్థుల చదువులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రాథమిక, సెకండరీ స్థాయిలో అమ్మ ఒడి, ఆపై చదువులకు జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలతో అండగా నిలుస్తోంది. ఇదే క్రమంలో విదేశాల్లో సైతం చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకంలో భాగంగా విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకైతే రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ.1 కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకే పథకం అందించేలా పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, దరఖాస్తుల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తోంది. జగనన్న విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణ మూర్తి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, పేద విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

టీడీపీ హయాంలో నిధుల దుర్వినియోగం

టీడీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది విదేశాల్లో చదువులు పేరిట నిధులు దోపిడీ చేశారు. విదేశాలకు వెళ్లినప్పటికీ, అక్కడ వేరు వేరు పనులు చక్కబెట్టుకోవటం, మరికొంతమంది అయితే విదేశాలకు వెళ్లకుండానే తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించి పథకం పక్కదారి పట్టించారు. దీని వల్ల విదేశాలకు వెళ్లి చదువుకోవాలనే అర్హులైన వారికి పథకం అందని పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దీన్ని ప్రక్షాళన చేసింది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికే పథకం వర్తింపజేసేలా విధి విధానాలు రూపొందించింది.

టాప్ 50లోనే చదువులు: ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్‌లో నిలిచిన 50 యూనివర్సిటీ/ ఇన్‌స్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక పరమైన సపోర్ట్ ఇవ్వనుంది. ఆయా కోర్సులకు అవసరమైన విద్యా అర్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ కోర్సు అభ్యశించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఆలిండియా స్థాయిలో నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. http://jnanabhumi. ap. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఈ కోర్సులకే అనుమతి..

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్– పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఎస్ట్రానమీ.

జూన్ 10 వరకు గడువు



అర్హత గల విద్యార్థులకు దరఖాస్తుకు జూన్ 10 వరకు గడువు ఉంది. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ. 8 లక్షలు మించకుండా 35 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. – డి.వి. రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, విశాఖ జిల్లా

మారుమూలలకు వెళ్లం..!

- విశాఖను వదలని అయ్యవార్లు
- పదోన్నతులకు ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- 300 మందిని పిలిస్తే, 151 మంది విల్లింగ్
- నేడు గ్రేడ్–2 హెచ్ఎంలకు అంగీకార పత్రాలు సేకరణ

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు మేలు చేయాలనే తలంపుతో ఉద్యోగోన్న తులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ, కొంతమంది అయ్యవార్లు వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. ఉద్యోగోన్నతులకు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయ అధికారులు అంగీకార పత్రాలను సేకరిస్తు న్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు)కు ఉద్యోగోన్నతి కల్పించేందుకు అర్హులైన వారి నుంచి డీఈవో కార్యాలయంలో శుక్రవారం అంగీకర పత్రాలను తీసుకున్నారు. సీనియార్టీ మేరకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 300 మంది ఉపాధ్యాయులను పిలిచారు. వీరిలో 181 మంది మాత్రమే ధ్రువీకరణ పత్రాల పరిశీలకు హాజరు కాగా, వీరిలో 151 మంది ఉపాధ్యాయులు మాత్రమే స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతి తీసుకునేందుకు అంగీకార పత్రాలు ఇచ్చారు. ప్రమోషన్ ఇస్తామన్నా, మాకొద్దంటూ ఉపాధ్యాయులు నిరాసక్తత వ్యక్తచేయడం గమనార్హం.

మారుమూలలకు వెళ్లటం ఇష్టం లేకనే..

ఉద్యోగులకు ప్రమోషన్ అంటే అదో సంబరమే. పనిచేస్తున్న కేడర్ నుంచి మరో కేడర్ పోస్టుకు వెళ్లటంతో పాటు, రెండు ఇంక్రిమెంట్లు మంజూరవుతాయి. దీని వల్ల నెలసరి వేతనంలో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. ఎంతలేదన్నా, ఒక్కో ఉపాధ్యాయుడికి నెలకు రూ.5 వేలు వరకు వేతనం పెరుగుతుంది. అయితే కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం, ప్రమోషన్ తీసుకునేందుకు నిరాసక్తత వ్యక్తచేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఎక్కువగా అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లోనే ఉద్యోగోన్నతి కేడర్‌లో ఖాళీలు ఉన్నట్లు డీఈవో కార్యాలయ అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి విశాఖ నగరం, దీని చుట్టపక్కల పాఠశాలల్లో తిష్టవేసిన ఉపాధ్యాయులు, ఇక్కడి నుంచి కదిలేందుకు ఇష్టం లేక, ఉద్యోగోన్నతులు సైతం వదులుకుంటున్నారనే ప్రచారం ఉంది.

నేడు స్కూల్ అసిస్టెంట్ల పిలుపు

గ్రేడ్–2 హెచ్ఎం పోస్టులు 13 ఖాళీ ఉన్నాయి. వీటిని అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఉద్యోగోన్నతి తీసుకునేందుకు ఇప్పటికే 10 మంది అంగీకార పత్రాలు ఇచ్చారు. కాగా మరో నలుగురు స్కూల్ అసిస్టెంట్లను ధ్రువీకరణ పత్రాల పరిశీలన, అంగీకార పత్రాల సేకరణ కోసమని శనివారం డీఈవో కార్యాలయానికి హాజరుకావాల్సిందిగా అధికారులు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన అర్హుల జాబితాను విడుదల చేశారు.

అంగీకారపత్రాలు సేకరిస్తున్నాం



ఉద్యోగోన్నతుల కోసమని అర్హులైన ఉపాధ్యాయుల నుంచి అంగీకార పత్రాలను సేకరిస్తున్నాం. సీనియార్టీ జాబితాలో ఉన్నప్పటికీ, కొంతమంది ఉపాధ్యాయు లు ప్రమోషన్ నిరాకరిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– లక్ష్మణరావు, ఇంచార్జి డీఈవో, విశాఖ జిల్లా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


అరకు వారపు సంతలో గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ శాఖ అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు వారపు సంతలో స్థానిక అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను విడనాడాలని, విస్తతంగా మొక్కలు నాటాలని, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవితాన్ని అలవర్చుకోవాలన్నారు. మన్యంలో లభించే చింతపండు, కాఫీ, కొండచీపుళ్లు, మిరియాలు, కాయగూరల వంటి వాణిజ్య పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అటవీ శాఖాధికారులు సూచించారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ పాటిస్తామని గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు రామారావు, పోతురాజు పడాల్, కృష్ణం నాయుడు, ఉద్దేంగ్, రేణుక, రామచంద్రరావు, మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.